# వెల్లివిరిసిన ఓటరు చైతన్యం

## వైరా నియోజకవర్గంలో 86.70 శాతం పోలింగ్



వైరాలో అతి తక్కువ పోలింగ్ శాతం నమోదు అయిన పోలింగ్ కేంద్రం

- గతం కంటే తగ్గిన పోలింగ్ శాతం
- అత్యధికంగా జూలూరుపాడు మండలం నల్లబోడు తండాలో 96.64
- అత్యల్పం వైరాలో 54.22 శాతం

**వైరా:** సార్వత్రిక పోలింగ్‌లో వైరా నియోజకవర్గంలో గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది పోలింగ్ శాతం తగ్గింది. ప్రతి ఎన్నికలలో నియోజకవర్గంలో ఓటర్లు పెరుగుతున్నారు కానీ ఓటింగ్ శాతం మాత్రం తగ్గుతుందని చెప్పవచ్చు. నియోజకవర్గంలో 86.70 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. గత సార్వత్రిక ఎన్నికలలో 88.82 శాతం నమోదు కాగా 2.12 శాతం ఓట్లు తగ్గాయి. గిరిజన గ్రామాల్లో ఓటింగ్ శాతం పెరగగా, మైదాన ప్రాంతమైన వైరా నియోజకవర్గ కేంద్రంలో పోలింగ్ శాతం బాగా తగ్గింది. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 252 పోలింగ్ కేంద్రాలు ఉండగా 74 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదు అయ్యింది. నియోజకవర్గంలో అత్యధికంగా జూలూరుపాడు మండలం నల్లబోడు తండాలో 96.64 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఆ తర్వాత కొణిజర్ల మండలం మెకాలకుంటలో 95.82 శాతం, అతి తక్కువ పోలింగ్ నమోదు వైరా మున్సిపాలిటీలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 54.22 శాతం నమోదు అయ్యింది.


| మండలం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | మహిళలు | పురుషులు | పోలింగ్ శాతం |
|---|---|---|---|---|---|
| కారేపల్లి | 45,011 | 38,166 | 19,263 | 18,902 | 84.79 |
| జూలూరుపాడు | 27,632 | 24,153 | 12,177 | 11,976 | 87.41 |
| ఏన్కూరు | 27,498 | 24,402 | 12,499 | 11,902 | 88.74 |
| కొణిజర్ల | 48,826 | 43,719 | 22,339 | 21,380 | 89.54 |
| వైరా | 44,102 | 36,949 | 19,095 | 17,853 | 83.78 |
| మొత్తం | 1,93,069 | 1,67,389 | 85,373 | 82,013 | 86.70 |

**కొణిజర్ల ముందంజ, వెనకబడ్డ వైరా**

నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలలో అన్నింటా కొణిజర్ల మండలమే ముందుంటుందని చెప్పవచ్చు. ఐదు మండలాల్లో అత్యధికంగా ఓటర్లు ఉన్న మండలం కొణిజర్లే 48826 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదు అయ్యింది కూడా కొణిజర్ల మండలమే అని గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయి. నియోజకవర్గంలో 7 మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా 3 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## మధిర నియోజకవర్గంలో 87.93 శాతం..

- అత్యధికంగా చింతకానిలో 91.10శాతం
- అత్యల్పం మధిరలో 83.83 శాతం




**మధిర:** మధిర నియోజకవర్గంలో గురువారం జరిగిన పోలింగ్ శాతం గత ఎన్నికలను పోల్చుకుంటే తక్కువగా నమోదు అయ్యింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మధిర నియోజకవర్గంలో 91.65 శాతం పోలింగ్ నమోదు కాగా రాష్ట్రంలోనే రెండో అత్యధిక పోలింగ్‌శాతంగా నమోదైంది. ఈ సారి ఎన్నికలకు సంబంధించి మధిర నియోజకవర్గంలో 87.93శాతం నమోదు అయ్యింది. సుమారు 4శాతం ఓట్లు తక్కువగా పోలింగ్ అయ్యాయి. మధిర మండలంలో 83.83 శాతం, ముదిగొండలో 88.50 శాతం, చింతకానిలో 91.10, బోనకల్‌లో 89.21, ఎర్రుపాలెంలో 88.08శాతం పోలింగ్ జరిగింది. మొత్తం నియోజవర్గంలో 2,21,326 ఓట్లు ఉండగా.. వారిలో 1,94,615 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పురుషులు 95,352, మహిళలు 99,260 మంది, థర్డ్ జెండర్లు ముగ్గురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## సత్తుపల్లి నియోజకవర్గంలో 87.43 శాతం..

- అత్యధింగా సత్తుపల్లి మండలంలోని రేగళ్లపాడులో 96.90 శాతం
- అత్యల్పంగా సత్తుపల్లిలోని అయ్యగారిపేటలో 65.61 శాతం

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో 87.43శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని 2,43,118 మంది ఓటర్లకు గాను 2,12,549 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి అశోక్ చక్రవర్తి శుక్రవారం వెల్లడించారు. ఇందులో 1,18,885 మంది పురుష ఓటర్లకు గాను 1,03,937 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, 1,24,225 మంది మహిళా ఓటర్లకు గాను 1,08,606 మంది తమ ఓటును వేశారు. 8 మంది ట్రాన్స్‌జెండర్‌లకు గాను 6గురు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని 172వ పోలింగ్ బూత్ రేగళ్లపాడు గ్రామంలో 452 ఓట్లకు 438 ఓట్లతో అత్యధింగా 96.90 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో తక్కువగా 186వ పోలింగ్ కేంద్రంలోని అయ్యగారిపేట బూత్‌లో 823 ఓట్లకు గాను 540 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 65.61శాతం పోల్ అయ్యింది.

## నూరుశాతం విజయం నాదే..



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

- ప్రజలందరికీ ధన్యవాదాలు
- బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

**సత్తుపల్లి:** నూటికి నూరుశాతం విజయం నాదే.. నాల్గోసారి సత్తుపల్లి ఎమ్మెల్యేగా వస్తున్నా.. మూడోసారి కేసీఆర్ సీఎం కావటం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. స్థానిక కౌన్సిలర్ మట్టా ప్రసాద్ నివాసంలో శుక్రవారం బూత్‌ల వారీగా పార్టీ శ్రేణులతో విశ్లేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే సంస్థలు, ఎగ్జిట్ పోల్స్, గ్లోబల్ ప్రచారాన్ని ప్రత్యర్థులే చేస్తున్నారని, ఓటర్ నాడి ఏ సంస్థకు చిక్కలేదన్నారు. నేను గెలిస్తే సత్తుపల్లి ప్రజలు ఆనందపడతారని మా దగ్గర అన్ని కోణాల్లో సమాచారాన్ని సేకరించామని, ప్రీపోల్, పోస్ట్ పోల్ చేయించామని అంతర్గత సమాచారం తెప్పించుకున్నామని విజయం నల్లేరుమీద నడకేనన్నారు. ఆవర్గం వేయలేదు.. ఈ వర్గం వేయలేదని.. ప్రత్యర్థులు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని అన్ని వర్గాల మద్దతు తనకు వచ్చిందని వేల మంది కార్యకర్తలు వచ్చి గెలుపులో భాగస్వామ్యం అయ్యామని చెబుతున్నారన్నారు. తల్లాడ నుంచి సత్తుపల్లి వరకు అన్ని మండలాల్లో బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీ వస్తుందని, తన గెలుపుకోసం కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు కొత్తూరు ఉమామహేశ్వరరావు, లక్కినేని రఘు, కట్టా అజయ్‌కుమార్, కాలెపు రామారావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎస్‌కె.రఫీ, గొర్ల సంజీవరెడ్డి, మానుకోట మధు పాల్గొన్నారు.

## డాక్టరమ్మను ఎమ్మెల్యేగా చేయాలని..



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి

- నా గెలుపు ఖాయం
- కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి

**సత్తుపల్లి:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయం.. మీ ఆడపడుచుగా గెలవటం ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మట్టా దయానంద్‌తో కలసి విలేకర్లతో మాట్లాడుతూ.. ధనబలం – ప్రజాబలం మధ్య పోటీ జరిగిందని, అందరూ ఊహించిన విధంగానే కాంగ్రెస్ పార్టీ గెలుస్తోందన్నారు. ప్రజలను ఎన్ని రకాలుగా ప్రలోభాలకు గురి చేసినా లొంగకుండా విజ్ఞతతో ఆలోచించి 'డాక్టరమ్మను ఎమ్మెల్యే' చేయాలని కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారన్నారు. ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఆరు గ్యారంటీల అమలును చేస్తామన్నారు. 10వేల నుంచి 12 వేలు మెజార్టీ వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల రుణం తీర్చుకోలేనిదని 72 ఏళ్ల సత్తుపల్లి చరిత్రలో తొలిసారిగా మహిళా అభ్యర్థిగా నన్ను గెలిపిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో చ ల్లగుళ్ల నర్సింహారావు, కొత్తూరు ప్రభాకర్ రావు, నారాయణవరపు శ్రీనివాసరావు, చంద్రోశేఖర్ రెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, వెల్ది జగన్మోహన్ రావు, ఉడతనేని అప్పారావు, గాదె చెన్నారావు, పద్మజ్యోతిరెడ్డి, శివవేణు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**కొణిజర్ల:** మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ ఇన్ ఫిజిక్స్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ కె.మానస శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్‌లో పీజీ అర్హతతో సెట్ లేదా నెట్ అర్హత సాధించిన వారు లేదా పీహెచ్‌డీ చేసి రెండేళ్ల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 5న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 94910 63083, 9951734125, 83328 64686 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

### ముగింపు దశకు చేరుకున్న వరి కోతలు



యంత్రం ద్వారా వరికోస్తున్న దృశ్యం

**కల్లూరురూరల్:** మండలంలోని వరి కోతలు చివరి దశకు చేరుకున్నాయి. వరికోతలు కూలీలతో కాకుండా మిషన్లతో కోస్తున్నారు. కల్లూరు మండలంలో 30వేల ఎకరాల్లో వేసిన వరిపంట సుమారు 8వేల ఎకరాలకు పైగా ఎండిపోయింది. మరికొన్ని నీటి ఎద్దడితో ఎండిపోయాయి. సాగర్ ఆయకట్టు కింద వేసిన వరిపంట ఎండిపోయింది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో మాత్రం పూర్తిగా మిషన్లతో వరికోతలు చేపట్టారు. పశువులకు ఎండి గడ్డి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి 20నుంచి 30బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఖరీఫ్‌లో రైతులు ఎక్కువశాతం 5204 రకం సాంబమసూరిని పండించారు.

### కల్యాణిని పరామర్శించిన మల్లు నందిని



**మధిర:** గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ అధినేత దోసపాటి కల్యాణి భర్త వెంకటేశ్వరరావు గురువారం మృతి చెందారు. దీంతో మల్లు నందిని మధిరలోని సుందరయ్యనగర్‌లో కల్యాణిని శుక్రవారం పరామర్శించి సంతాపం తెలిపారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు రంగా హనుమంతరావు, పారుపల్లి విజయ్, తన్నీరు రామకృష్ణ, పాటిబండ్ల సత్యంబాబు ఉన్నారు.

### కోటయ్య మృతికి సంతాపం

**కల్లూరురూరల్:** మండలంలోని ముచ్చవరం గ్రామ పంచాయతీ శివారు విశ్వనాధపురంకు చెందిన సీపీఎం సానుభూతి పరుడు కోటయ్య మృతికి ప్రముఖులు నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ వెంకటేశ్వరావు, పుసులూరి శ్రీనివాసరావు, బజవయ్య, సీపీఎం సీనియర్ నాయకులు తాతాభాస్కర్, మాదాల వెంకటేశ్వరావు, తన్నీరు కృష్ణార్జునరావు, హనుమయ్య తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## స్ట్రాంగ్ రూమ్‌కు తరలిన ఈవీఎంలు



వైరాలో వాహనానికి సీల్ వేస్తున్న అధికారులు

**వైరా:** వైరా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలను శుక్రవారం అధికారులు వైరా పంపిణీ కేంద్రానికి తరలించి.. ఆర్టీసీ రెండు కార్గో వాహనాల్లో ఖమ్మంలోని పాన్నెకల్ కిట్స్ పాత కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. ఆర్‌ఓ బి.సత్యప్రసాద్ పర్యవేక్షణలో వాహనాలకు సీల్ వేసి గట్టి బందోబస్తు నడుమ ఖమ్మం తరలించారు.

**లెక్కింపు కేంద్రానికి తరలిన ఈవీఎంలు..**

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి నియోజకవర్గ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల ఈవీఎంలను శుక్రవారం స్థానిక జ్యోతినిలయం స్ట్రాంగ్ రూం నుంచి ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్ శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలించారు. నియోజకవర్గానికి సంబంధించిన 292 పోలింగ్ కేంద్రాల 292 ఈవీఎంలను 3 కార్గో బస్సుల్లో ఎన్నికల సామగ్రిని మరో బస్సులో పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు. ముందుగా బస్సుల్లో ఈవీఎంలను భద్రపరచి సీజ్ చేశారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి, ఏసీపీ రామానుజం, రాజకీయపార్టీల ఏజెంట్లు పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: ఈవీఎంలను కార్గో బస్సుల్లో తరలిస్తున్న అధికారులు

## హెచ్‌ఐవీ నివారణపై అవగాహన



మధిర: బ్యానర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



వైరా: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



సత్తుపల్లిటౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**మధిర:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో హెచ్‌ఐవీ నివారణపై కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు రవికుమార్, పృథ్వీ నాయక్, వీరబాబు మాట్లాడుతూ.. సమాజంలో ప్రతీ ఒక్కరు ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కిండ్లీ రూరల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు వి.అనూష మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ నివారణ కోసం యువతకు అవగాహన కల్పించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎయిడ్స్ నివారణ మనందరి బాధ్యత అని తెలిపారు.

**వైరా:** ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఠాగూర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, కరస్పాడెంట్ సంక్రాంతి రవికుమార్, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ పీఓ లింగరావు, ప్రిన్సిపాల్ కృష్ణారావు, అధ్యాపకులు మజీద్, వేణు, శిరీష, చైతన్య, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**కారేపల్లి:** కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్‌పై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సురేష్ ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యురాలు శ్రేష్ఠ సాఫల్య, సీహెచ్ఓ భద్రయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యం పాల్గొన్నారు.

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మాధవి, కేర్ టేకర్ రవికుమార్, అధ్యాపకులు రామచంద్రరావు, చెనావవ్వ, కృష్ణారావు, రాజ్యలక్ష్మి, రాజ్‌కుమార్, మురళి, శ్రీకాంత్ పాల్గొన్నారు. అదేవిధంగా తేజా ఒకేషనల్ కళాశాల ఆధ్వర్యంలో పట్టణంలో విద్యార్థులు హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల కారస్పాండెంట్ కూసంపూడి మధు, డైరెక్టర్ శ్రీను, ప్రిన్సిపల్ ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన సంగ్రామం..
# ఇక ఎదురుచూపులు

- ఎవరికి వారే ఫలితాల జోస్యం
- ఎగ్జిట్ పోల్‌పై ఆధారం
- సంబరాలకు సై అంటున్న అభిమానులు, కార్యకర్తలు



**ముదిగొండ:** అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ దగ్గర నుంచి మధిర నియోజకవర్గంలో రసవత్తరంగా సాగిన పలు పార్టీల ప్రచారాలు, సమావేశాలు, మీటింగ్‌లతో హోరెత్తించిన నాయకులు, అభ్యర్థులు, ఒక నెల రోజుల నుంచి రాత్రనక, పగలనక సాగిన సంగ్రామానికి నవంబర్ 30న ఎన్నికలు జరిగాయి. మరుసటి రోజు నుంచి ఫలితాల కోసం ఎవరికి వారే గెలుపు గుర్రాలు ఎక్కుతున్నారు. ఈ నెల 3న ఎన్నికల లెక్కింపుతో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తున్నాయి, ఎవరు పరిపాలిస్తారు, ఏ ప్రభుత్వం వస్తుందోనని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ముదిగొండ మండలంలో ఎక్కడ ఏ గ్రామంలో చూసినా నలుగురు, ఐదురుగు ఉన్నా ఇదే సంభాషణ. ఓటు వేసి వచ్చిన ఓటర్లు తమ పనుల్లో ఉన్నా, మిగతా వారంతా తమ చుట్టు ఉన్న పలు రాజకీయాలపై చర్చించుకుంటున్నారు. పలు గ్రామాల్లో ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు రంగులు, టపాసులు, డీజేలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నెల 3న రంగు ఎవరికి పడుద్దో వేచి చూడాలి మరి.

## ఫలితాలపై ఉత్కంఠ..

- లెక్కల్లో మునిగిన నాయకులు
- ఎక్కడ విన్నా అభ్యర్థుల గెలుపోటముల ముచ్చట్లే..




**ఎర్రుపాలెం:** పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల్లో భద్రంగా ఉంది. ఈ నెల 3వ తేదిన కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయగా.. గ్రామాల్లోని ఆయా పార్టీల నాయకులు తమ తమ అభ్యర్థులకు ఎన్ని ఓట్లు పడ్డాయో అనే లెక్కల్లో మునిగి తేలారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ అభ్యర్థిగా జెడ్పీ చైర్మన్‌గా లింగాల కమల్‌రాజ్, సీపీఎం అభ్యర్థిగా పాలడుగు భాస్కర్‌లు పోటీ చేయగా పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులున్నారు. రాష్ట్రంలోనే కీలకనేతగా ఉన్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్ని హంగులతో ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. అదే రీతిలో ఓట్ల పోల్ మేనేజ్‌మెంట్ బాగా కలిసి వచ్చిందనే ప్రచారం ఉండగా, బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజ్ మాత్రం పోల్ మేనేజ్‌మెంట్‌లో కొంతమేరకు వెనుకబడ్డారనే విషయాన్ని పలువురు చర్చించుకోవడం వినిపించింది. సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్ ప్రచారం ఇంటింటికీ చేరలేదనే బూత్‌ల వారీగా ఏజెంట్లు, నాయకుల నుంచి లెక్కలను అభ్యర్థులు సేకరించారు. ఇది ఇలా ఉండగా రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ వస్తుందని చాలా ఎగ్జిట్ పోల్స్ ప్రకటించగా కాంగ్రెస్ శ్రేణుల్లో బాగా ఉత్సాహం కనిపించింది. అధికార బీఆర్ఎస్ నేతలు మాత్రం సర్వేలు అంత నమ్మశక్యంగా లేవనే నమ్ముతున్నారు. మొత్తం మీద ప్రధాన కూడళ్లల్లో, హోటల్స్, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయ ప్రాంగణాల్లో కూడా ఇవే ముచ్చట్లు వినిపిస్తున్నాయి. ఎవరికి లెక్కల్లో వారు మునిగి తేలుతున్నారు.

## తెరుచుకున్న నూతన మద్యం దుకాణాలు

**ఎర్రుపాలెం:** మండలంలోని మీనవోలు, బనిగండ్లపాడు, రాజుపాలెం, ఎర్రుపాలెం గ్రామాల్లో శుక్రవారం నూతన మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. గతంలో దుకాణాలకు నవంబర్ 30వ తేదితో లైసెన్స్ ముగిసింది. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకురావడంతో టెండర్లల్లో ఏడు దుకాణాలు దక్కించుకున్న యజమానులు షాపులను తెరిచారు. మద్యం షాపులను దక్కించుకున్న యజమానులు పూజా కార్యక్రమాల అనంతరం దుకాణాలను ఓపెన్ చేశారు. ఈ దుకాణాలకు రెండేళ్ల పాటు లైసెన్స్‌లు ఉండటంతో ఇవే షాపులు కొనసాగనున్నాయి.

# ప్రయాణం.. ప్రాణసంకటం

**ప్రమాదకరంగా హైలెవల్ వంతెన**

- స్లాబ్‌ల మధ్యలో భారీ గుంతలు
- మరమ్మతులు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- భయాందోళనలో ప్రయాణికులు



వాహనాలు బ్రేక్ వేయడంతో వంతెన మీద పడిన మట్టి రాళ్లు (ఫైల్)





వంతెన జాయింట్ల మధ్యలో ఏర్పడిన గుంతలు

**వైరారూరల్:** మండలంలోని స్టేజీ పినపాక గ్రామ సమీపంలో ఉన్న హైలెవల్ వంతెన మీద ప్రయాణం.. ప్రాణసంకటంగా మారింది. ఇది జాతీయ ప్రధాన రహదారి కావడంతో.. ఇటుగా నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యాన వంతెనపై స్లాబు–స్లాబుకు మధ్యలో ఉన్న జాయింట్లపై ఏర్పడిన గుంతలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వంతెన మీద ప్రయాణిస్తున్న వాహనదారుల దగ్గరకు వెళ్లే వరకు కూడా గుంతలు కనబడకపోవడంతో ఒక్కసారిగా తమ వాహనాలను అదుపుచేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని నెలల నుంచి జాయింట్లపై భారీ గుంతలు ఏర్పడిన సంబంధితశాఖ అధికారులు సకాలంలో మరమ్మతులు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

**ఇరువైపులా అదే పరిస్థితి..**

ఈ హైలెవల్ వంతెన ఖమ్మం–దేవరపల్లి జాతీయ ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉంది. దీంతో తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి ఆంధ్రాకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. ఈ జాతీయ ప్రధాన రహదారికి అనుసంధానంగా వైరా మండల కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న హైలెవల్ వంతెన ప్రమాదభరితంగా ఉంది. సుమారు 200 మీటర్ల మేర ఉన్న హైలెవల్ వంతెన మీద స్లాబు–స్లాబుకు మధ్యలో ఉన్న జాయింట్ల మీద ఇరువైపులా సుమారు రెండు అడుగుల లోతులో ఏర్పడిన గుంతలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. అనేకమంది ప్రయాణికులు వీటిని తప్పించే క్రమంలో ముందు వాహనాలను ఢీకొని గాయాలపాలవడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడం ఈ వంతెన మీద అనవాయితీగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ప్రాణాలు పోయే వరకు అధికారులు స్పందించరేమోనని ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

**చర్యలు తీసుకోవాలి..**



అనునిత్యం హైలెవల్ వంతెన మీద పాలకులు రాకపోకలు సాగిస్తున్నా.. వంతెన జాయింట్ల మీద ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయించడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాహనదారులకు దగ్గరకు వెళ్లే వరకు కూడా ఈ గుంతలు కనబడని నేపథ్యాన నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పెనుప్రమాదాలు జరగకముందే పాలకులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. – మల్లు రామకృష్ణ, ఉపసర్పంచ్, స్నానాల లక్ష్మీపురం